సీరియల్

# జయాపజయాలు

"శండిల"

అనుకోకుండా ఆ వేళ బండి ఆలశ్యంగా చేరింది ఆ వూరు. అసలు అయిదింటికే అది చేరుకోవలసింది. దానికి దారి పొడుగునా అడ్డాలే. అన్ని స్టేషనులలోనూ ఆఖరికి అతి చిన్న స్టేషనులో కూడా ఆగితీరవలసిందే. కాబట్టి నాకు మరీ విసుగుపుట్టింది. ప్లాటుఫారంమీద అడుగు వేస్తూ వాచ్ చూసుకున్నా. ఎనిమిదయ్యింది. ఎనిమిదయిందన్న గుర్తు కాబోలు 'బోఁయ్' మని సైరను కుయ్యాషం మొదలు పెట్టింది. స్టేషన్నుంచి బయటకొచ్చి సైకిలు రిక్షా తీసుకుని బయలు దేరాను. వాడు 'ఎక్కడికి' ని అడగనూ లేదు — నే చెప్పనూ లేదు. రోడ్డు వెంబడి ఎన్నో రిక్షాలు పోటీ పడుతున్నట్టు విసురుగా పోతున్నాయి. దారికి ఇటు అటు వున్న పెద్ద పెద్ద భవంతులకు వ్రేలాడగట్టబడివున్న సైనుబోర్డులు చూస్తున్నా. కొన్ని ఏవేవో దుకాణాలవి, బట్టలు, కిరాణా, ఫ్యాన్సీ ఇత్యాదులు. మధ్య మధ్య ఉన్నవి మంగలిషాపులు రెండో మూడో. సోడా, కిళ్లీల కొట్లు మరికొన్ని. ఇంకొన్ని హోటళ్లు. ఒక బోర్డుమీది అక్షరాలు నన్ను ఆపుచేశాయి. 'ఆపరా!' అన్నా రిక్షావాడితో. రిక్షా నిలిచిపోయినది. ట్యూబులైట్ల కాంతిలో మిలమిలలాడుతున్న, బంగారపు తాపటపు అక్షరాలా అని భ్రమగొలిపే, పాలిషు చేయబడ్డ ఇత్తడి అక్షరాలు చదువుతున్నా, "భోజనవసతి గృహము" అబ్బ! ఎంతలేసి అక్షరాలో! వాటిక్రింద వున్న చిన్న అక్షరాలే నన్ను అధికంగా ఆకర్షించాయి. "ఆధునిక పద్ధతులతో అమర్చబడిన పడకగదులు మా ప్రత్యేకత" అనే తమ పరిచయంతో. "అంటే?" అప్రయత్నంగా నా మనస్సు ప్రశ్నించింది. త్రుటిలో లెదరు సూట్ కేసు పట్టుకొని రిక్షా దిగి "పట్టుకురారా! ఆ బెడ్డింగు లోపలికి" అంటూ చరచరా హోటలులోనికి వెళ్ళాను. జేబులోంచి మూడు అణా బిళ్ళలు తీసి రిక్షావాడి చేతిలో పెట్టాను. బహుశా అంతమాత్రం దూరానికి వాడు అనుకున్న దానికంటె హెచ్చే యిచ్చివుండాలి నేను. లేకుంటే సంతోషంతో మందహాసం చేసి సలాముతో వాటి నందుకుంటాడా ఆ కష్టజీవి?

నేను నిలబడ్డాను ప్రొప్రయిటరు క్యాషు టేబులు ముందు. నాకు నాలుగువైపులా కొద్ది గజాల దూరంలో వున్న గోడలన్నీ నిలువుటద్దాలతో తాపబడివున్నాయి. ఎటుచూసినా నాప్రతిబింబాలే నన్ను ఆకర్షించాయి చిరునవ్వులతో. హాలులో అరడజను ట్యూబులైట్లు వెలుగుతున్నాయి. వాట్లపై పురుగులు తెగ ముసురుతున్నాయి. టిఫెన్లు కాఫీలు వుంచడానికి ఏర్పాటు చెయ్యబడ్డ బల్లల ఉపరితలాలు చలువ రాళ్లతో ప్రకాశిస్తున్నాయి. 'ఆధునిక పద్ధతులంటే ఇవేనా?' అనుకుంటూ విస్తుపోతుంటే "ఏం కావాలండీ? స్పెషలు రూమా?" అని ప్రశ్నించిన ప్రొప్రయిటరు కంఠం వినిపించింది. "ఆఁ—ఒక రాత్రికి ఎంత ఛార్జిచేస్తారు?" అన్నాను.

"రాత్రికైతే మూడు రూపాయలు. పగలూ, రాత్రీకూడా వుంటే అయిదు" అన్నాడు.

"అలాగా? ఈ రాత్రికి వుండి రేపు పనిని బట్టి చూస్తా" అన్నాను.

"సరేనండి". అని టేబులుమీది గంటనొక్కాడు. వెంటనే ఒక నడిమి వయస్సులో వున్న వ్యక్తి వచ్చాడు.

"వీరిని ఆరో నంబరు గదికి తీసుకెళ్లు. స్నానాదులకు ఏర్పాట్లన్నీ సిద్ధంగానే వుంటాయి—పదండి" అని మమ్మల నిద్దరను సాగనంపాడు.

మా చుట్టూ సర్వర్లు, సప్లయర్లు, ప్యాసింజర్లు చేసే రణగొణ ధ్వనిని చీల్చుకుంటూ వంకరగా మేడ ఎక్కిన మెట్లమీదుగా పోయి గది చేరుకున్నాం.

అప్పటిమటుకు అక్కడ అన్ని ఏర్పాట్లూ సవ్యంగానే ఉన్నట్లుతోచింది. అద్దమూ, దువ్వెన, కొబ్బరినూనె సీసా, టేబులు, కుర్చీ, విస్త్రీనుడత తుండు-చక్కని మంచం, పరుపుమీద తెల్లదుప్పటి, మెత్తని బూరుగుదూది తలగడ—ఫ్రేము అమర్చిన దోమతెర బాగానే వున్నాయి. ప్రక్కనే పదిగజాలదూరంలో స్నానాలగది. లోపల నీటిపంపు, సబ్బుబిళ్ళ — పంపుక్రింద ముక్కాలిపీట, యెత్తున గచ్చుతో గట్టిన దిమ్మ—స్నానానికి కావలసిన సరంజామంతా వుంది. వీటన్నిటిని నాకు చూపించి ఆయన క్రింది కెళ్ళిపోయాడు. ఇటు అటు గదులు పరకాయించాను. కొన్నిటిలో ఎవరో వుండి వాళ్ళ పనులు చూసుకుంటున్నారు. కొందరు తమ విలాసం తెలిపే చిన్న కార్డులు తలుపు చెక్కలకు అమర్చబడ్డ 'కంతలలో వుంచి గదులకు తాళాలు వేసి ఊళ్లోకి తమపనులు చక్కబెట్టుకోవడానికి వెళ్లివుంటారు.

నేను గదిలోకెళ్ళి చొక్కా, బనియనూ విప్పుకుంటూ కిటికీ తెరచి బయటి ప్రపంచంలోకి చూశాను. దూరాన పారేటి నది—ఒకవంక దగ్గరగా సినీమా లైట్లు "దేవదాసు" అంటూ వెలుగుతూ, ఆరిపోతూ ప్రకటిస్తున్నాయి ప్రజకు. మరోవైపు రైలు స్టేషను. ఓవరుబ్రిడ్జి, ఇంజన్లలోంచి వెలికివస్తూ వికృతంగా కారుమేఘాలను సృష్టించే పొగ — వీటన్నిటినీ చుట్టుకొని రొదజేసే జనానీకపు సొద — పట్నానికి తగ్గ హంగులన్నీ సమకూర్చుకొందిరా ఈ వూరు అనిపించింది. త్వరగా సామానంతా లోపల సద్దుకొని పది నిమిషాలేనా దాటకుండా స్నానం పూర్తిచేసి శుభ్రమైన దుసులు వేసుకున్నాను.

కాస్సేపు తచ్చాడి టైముచూసుకొన్నా. పది నిముషాలు తక్కువ తొమ్మిది. భోజనానికి పిలుపు వచ్చింది. లేచి గదికి తాళం వేసుకొని భోజనశాలకు వెళ్ళాను. భోజనం శుభ్రంగా, శుచిగా, రుచిగా వుంది. కడుగుకొన్న చెయ్యి తడియారకుండానే వాళ్లిచ్చిన కిళ్ళీ నములుతూ మేడమెట్లెక్కి గదిలోకి వచ్చాను. కొంచెం ఉక్కగా ఉన్నందువల్ల చొక్కా తీసి కొక్కానికి తగిలించి తలుపుదగ్గరగా వేసి, కిటికీ తెరచి మంచంమీద నడుం వాల్చాను. దూరాన నదీజలాలపై నుండి చల్లని గాలి గది వైపు వీస్తోంది. క్రింద రాజవీధిలోని రద్దీ కలకలం వినిపిస్తూనే వుంది. ఒక మూలనుంచి "టేబుల్ క్లీన్, ఒరు చపాతీ, రెండు స్ట్రాంగ్ టీ" ఇంకా ఏవేవో హాలికేకల్లాగ సర్వర్లగోల.

మంచంపై పడుకొని రేపటి కార్యక్రమంగూర్చి ఆలోచిస్తున్నా.

ఊహాలు ఒక వస్తువునుంచి ఇంకొకదానికి గగనసీమలో క్రమంగా విడివడే గాలిబుట్టలవలె విస్తరిస్తున్నాయి. పట్టణం నాకు సుపరిచితమే. ఇద్దరో ముగ్గురో మిత్రులుగూడా వున్నారు. రాత్రివేళ వాళ్లను ఇబ్బంది పెట్టడం ఎందుకని ఈ హోటల్లో దిగాను. రేపు వాళ్ళను కలుసుకోవాలి. తర్వాత ఊళ్లో పనిముగించుకొని రాత్రి ఎనిమిదిన్నరకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణం. ఇంకా తీగలు సాగుకుపోతున్న నా యోచనలను కొన్ని సంఘటనలు హఠాత్తుగా బయటకునెట్టాయి.

నా గది ప్రక్కనుండి ఎవరో ఎగువకు వెడుతూ వుండాలి. కాలికి జోడుంటే చప్పుడవదూ? అయితే ఆ గలగలేవిటీ? బహుశా గజ్జెలు అయివుండాలి. ఒక స్త్రీ గజ్జల పట్టీలు గల పాదాలతో నడుస్తూంటుంది. కాళ్లు కొంచెం దళసరిగా వుండివుంటాయి. ఒత్తుగా పడుతున్న సవ్వడి. క్షణంసేపు నిశ్శబ్దం. మళ్ళీ కొంచెం ధ్వని. మనసు తక్కిన విషయాలన్నిటిని తప్పించుకొని పరిశీలన దెసకు ఎగబ్రాకింది. ఎవరో పురుషులు గూడా వుండివుండాలి వారితో. స్త్రీల వికవికలు, పకపకలు, పరియాచికాలు, అవన్నీ అదోకరకం. బహుశా పురుషుడు స్త్రీల వీపుపై చరచి వుంటాడు. అదే చప్పుడు "చూడు! జడకొసన గట్టిన చేమంతిపూలబంతి నలిగింది. మోటసరసం!" స్త్రీ గొంతు గూడ మోటుగానే వుంది.

ఇంకొకరకం స్త్రీది ఆ నడక. ఏకత్రోపాటే. లేకపోతే ఆ గాజుల గలగలలేవిటీ? ఇదేం వరస? ఈ హోటల్లో ఇలాంటి వ్యాపారాలు గూడానా? ఏమో "ఆధునిక పద్ధతులం"టూ అక్షరాలు చెక్కించారు ఇందుకేనేమో!

దిగువన - రెండవనంబరో మూడోదో—అక్కడకు నడచివచ్చే ఆడది కొంచెం నాసిరకం అయివుండాలి. లేకుంటే మడమలు ఒకటికొకటి డీకొని, కాళ్ల కడియాలు కొట్టుకుంటూ సడిచేస్తాయా? ఈ వింతల నాలకిస్తూ పరిపరివిధాల వీటినిగూర్చి యోచిస్తూనే నూహించినట్లు ఈ హోటల్లో ఆ వ్యాపారం

ఉందా లేక ఇది నా అనుమానమేనా అని తర్కించుకొంటున్నాను. పట్టణంలో ఇలాంటి హోటళ్లువుంటాయని చాలాసార్లు విన్నాను. ఏ వొక్క ఆకర్షణా లేకుండా ఎలాగ బ్రతుకుతారు వీళ్లు ఈ భవంతులను పోషిస్తూ—ప్రభుత్వానికిగాని, ప్రజా సంస్థలకుగాని ఈ దుష్పద్ధతులు తెలియవూ? లేక తెలిసే ఉపేక్షించడం జరుగుతోందా? ఇదేదో తెలుసుకోవాలన్న ఉత్సాహం, ఉద్వేగం హెచ్చైంది నాలో. మళ్ళీ నిశ్శబ్దం. దూరాన ఊరి ధ్వనులు తక్క అంతటా నిశ్శబ్దం ఆవరిస్తోంది.

## 2

నిశ్శబ్దం భంగపడింది. నా ఆలోచన ఆగిపోయింది. గుండె కూడా కొట్టుకోవడం మానేద్దామా అని ఆరాటపడింది. ఎవరో నా గదివైపే నడచివస్తున్నారు. సర్వమూ ఆ పదధ్వనివైపే కేంద్రీకరించి చెవులు కళ్లు చేసుకొని చూస్తున్నాను. అదొక ఆశ్చర్యకరమైన నడక. అందులో ఒదుగు పురుషుడిది కాదు. పామేదా మగతనానిదసలే కాదు. ఆ అడుగులు నా గది ముంగిటనే ఆగిపోయాయి. తలుపులు నెమ్మదిగా నెట్టబడ్డాయి. లోనికి ప్రవేశించిందొక స్త్రీ. ఆలోచనలోపడి నేను తలుపుమూయ్యడం మరచిపోయినట్లు తెలిసింది. ఆమె శరీరంమీది ఏ వస్తువుకు కదలిక ఎంతమాత్రము లేదు. స్థిరమైన హృదయం ఉండదగ్గ సుస్థిరమైన దేహం. ఆమె ఎంత చప్పుడు చెయ్యకుండా ఉండాలని ప్రయత్నించినా తలుపు నేల కానుకొని జరజరలాడింది. ఆపాటి సాకు లేకపోతే నేను ఇప్పటిదాకా అటు ఆలోచిస్తున్నట్లు ఆమెకు తెలియనివ్వకుండా ఆ దెసకు మళ్లడం ఎలాగ? మళ్ళీ తలుపును నెమ్మదిగా చేరవేసింది. ఆమె నేర్పరి గాకపోతే మూతపడుతూ తలుపు గొడవచేసివుండేది. తిన్నగా చడీ చప్పుడు చెయ్యకుండా నడచి అద్దం వున్న బల్లమీదకు వంగి చేతిలోని గ్లాసు నక్కడుంచింది. అలాగుంచుతూనే మళ్లీ ఒకసారి తన ముఖం అద్దంలో ఎలా వుందో చూసుకునే వుంటుంది తప్పక. గ్లాసు బల్లను తాకుతూనైనా చప్పుడు చెయ్యలేదు. దానిమీద సాసరు బోర్లించింది—అప్పుడూ లేదు చప్పుడు. "అమ్మయ్య!" అనుకొన్నాను స్థాయి చలించకుండా వున్న ఆ వనిత తలయెత్తి నా వైపు చూడ్డంతో.

"ప్రొప్రయిటరుగారు మీ కిచ్చి రమ్మన్నారు పాలు. పడుకోనేముందు పాలుపుచ్చుకునే అలవాటని చెప్పారుట". మాటల్లో గూడా ఏ నదురూ బెదురూ లేదు. నిశ్చల జలపూరితమైన తటాకంవలె వుంటుంది ఆమె ఎడద? లేక తుఫాను అనంతరం ప్రశాంతతను రూపొందించుకున్న సాగరోపరితలం వంటిదా? నా పోలికలకు పొలిమేరలవుపించడం లేదు. 'నిజమే. నేను మరచిపోయాను' అనుకుని ఇంకా అలాగే నిలుచున్న ఆమెను చూశాను. ఆమెకు ప్రత్యుత్తర మివ్వదలచుకోలేదు. దాదాపు అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. మళ్ళీ నాకే ఇంకో ఊహ! ఆమె నా ప్రత్యుత్తరంకోసం నిరీక్షిస్తోందా? ఆమెతో ఏమీ మాట్లాడకపోవడం ఏం బాగుంటుంది? మళ్ళీ ఆమెను పరీక్షగా చూశాను. స్త్రీయే, కన్య కాదు. ఇరవయ్యో పాతికో మధ్య వుంటుంది వయస్సు. పట్టిపట్టి చూడకపోతే పదహారేళ్లేనా దాటవన్న భ్రమ గలుగుతుంది. స్త్రీ ఏది చెప్పినా నమ్మవచ్చుగాని వయస్సు మాత్రం నమ్మగూడదు. సంసారేతర వనితలు చెప్పే వయః ప్రమాణం సర్వత్రా సందిగ్ధమే. దీర్ఘంగా నిట్టూర్చి "సరే" రెండే రెండు ముడి అక్షరాలను వెలికి ఉబికించింది నా హృది. ఓహో! ఏమి గాంభీర్యం! ఆమాటకోసమేనా ఆమె అంతసేపు అలా వేచివుంట? అంతే. గిరుక్కున మళ్లింది. ఆమెకు కోపం కలిగివుండదు. చిన్నతనం అంతకన్నా అనిపించదు. అవమానానికి తావులేదు. లేకపోతే కనీసం అపుడే విడచిన చేమంతి పూలు అంటించివేసిన వాలుజడ సుంతైనా కదలదూ? కాళ్లుచేతులు ఇటు అటు ఆడవూ? పలుచని, సన్నని పొడవైన వ్రేళ్లుగూడా కణుపుకణుపుల మధ్య వీసమెత్తు కదలికనైనా పొందుపరచుకోలేదే — ఆమె ప్రయత్నించి ఆ అవస్తను సాధించలేదు. అసలు ఆమె తీరే అంతేమో! అయితే ఆమెకు అనుకున్నా వశంకాని దొకటిజరిగింది. మల్లు బాడీమీది గ్లాస్గో రవికెపైన కప్పుకున్న పలుచని ఉల్లిపొరలాంటి వాయిల్ చీర కదలి, కొంగువొసిలి, పైటచెరగున అద్దబడ్డ వివిధవర్ణాల డిజైనులు కిటికీలోంచి వచ్చే చల్లగాలి తెమ్మెరలకు అందంగా రెపరెపలాడి ముచ్చటగా రంగుల తరంగాలు మురిపెం కూర్చాయి. మరుక్షణంలో ఆమె అవుపించలేదు. తలుపులు మళ్ళీ దగ్గరపడ్డాయి. పడుతూగూడా చప్పుడు చెయ్యలేదు. ఈ వాతావరణమంతా ఆమె గాంభీర్యాన్ని చెప్పక చెప్పు

తోంది. విచిత్రమైన ఊహల్ని నాలో చెలరేగదీసి ఆ వనిత వెళ్లిపోయింది. పరిపరి విధాల పోతోంది మనస్సు. ఆమె ఎవరు? వారాంగనా? హోటల్లో వుండే పనిమనిషా? యజమానుల బంధువా? ఛా! ఎందుకౌతుంది? అయితే అలాగ ఇంకొకడికి పాలు తెచ్చి ఇస్తుందా? ఇదేదో తేల్చుకోవాలి అని తీర్మానించుకున్నాను.

నాలో సంఘర్షణ బయలుదేరింది. "ఆమె మళ్లీ వస్తే బావుంటును"

"ఎందుకొస్తుందీ? నీవు వచ్చేలాగే ప్రవర్తించావం?"

"ఎలాగైనా సరే ఆమె రావాలి."

"రాగూడదు. వచ్చినందువల్ల ప్రయోజనం శూన్యం. ప్రమాదంగూడా రావచ్చు."

"ఆమె వ్యభిచారిగదా—అట్లాంటి దానికి గూడా మానాభిమానా లుంటాయా?"

"ఎందుకుండగూడదు? సంఘం ఒక్కొక్కడిని ఒక్క అనాథబాలపై దండెత్తి ఆమెను నొక్కిపట్టి నులిమివెయ్యాలనుకుందనుకో – దాన్ని తప్పించుకోవడానికి, పుట్టిన ప్రతి ప్రాణీ చచ్చేదాకా ఎలాగో ఓలాగ శరీరం నిలబెట్టుకోవాలనే సూత్రం ప్రకారం వ్యభిచారానికే పాల్పడిందనుకో — అంతమాత్రాన ఆమెకున్న ఇతరగుణాలు కూడా లాగెయ్యడానికి సంఘానికి హక్కు ఎవరిచ్చారు? వ్యభిచారికి అభిమానం ఎందుకుండగూడదు?

"అలాంటపుడు ఆమె మళ్ళీ రావచ్చుగా—ఇంక ప్రమాదమేమిటీ?"

"ఓహో! అలాగా—నీ వూహిస్తున్నట్లు వ్యభిచారమనే దోషంవల్ల ఆమె నీ కంటికి హీనురాలు. కనాకష్టమైన క్షుద్రజీవి. అయితే అనేక ఇతర విషయాల్లో ఆమె నీకంటె అధికురాలు ఎందుక్కాకూడదు! వాటిని పురస్కరించుకొని నీపై ఎందుకు దాడి చెయ్యకూడదు? ఏమో ఆయా సందర్భోచితంగా నీవు చిత్తవకూడదని నియమంవుందా?"

దరీ అంతూ లేని ఘర్షణ చాలాసేపు నాలోని విభిన్న ప్రకృతులమధ్య నడిచింది. ఒక్కొక్కతూరి మొదటిపక్షం క్రిందౌతోంది; ఇంకొక్కప్పుడు రెండవది తేలిపోతోంది. పర్యవసానమేమౌతుందో చూడాలనే కుతూహలం అధికమయ్యింది. ఆమె రాకపోతే బావుండును. పాలమాట గుర్తొచ్చింది. లేచి గ్లాసు ఎత్తి పాలు నోట పోసుకున్నాను. దుగ్ధంలోని మధురిమ నన్ను మత్తెక్కించింది. నేను మారిపోయాను. ఇంక ఆమె రాకకై నిరీక్షయే నాకు మిగిలింది.

ఈతూరి తలుపులు చప్పుడుతోనే తెరచుకున్నాయి. వచ్చింది ఆమె. "లైట్లు వెలుగుతూంటే స్విచ్ ఆఫ్ చెయ్యడం మరచి నిద్రపోతున్నారేమో అనుకున్నాను. మెళకువతోనే ఉన్నారా?" ఓహో! ఈ ప్రశ్న వేసిన వైఖరి నా ఎదను ఎలా గిలుపుతోంది? విధి నూటికి నూరుపాళ్లు ఆమెకే సుముఖంగా వున్నాడు. లేకపోతే ప్రతిసారి ఆమెకే చక్కని అవకాశం లభిస్తుందా సంభాషణకు? ఇంక నేను తెగించక తప్పిందికాదు. "లైటు ఆర్పడం మరిచిన మాట నిజమే—ఆర్పెయ్" ఓటమిని ఒప్పుకుంటూ కూడా గంభీరంగా మాట్లాడేవాడికివలె నానుండి వెలువడ్డాయి పలుకులు. "తలుపు దగ్గరగా వేసెయ్" స్విచ్ ఆఫ్ చేసిన ఆమెతో అధికారపురస్కృత ధోరణిలో అన్నాను. ఎంతటి ధైర్యం ఆమెది? ఆమె జాణకూడానా? ఆమె బయటకు వెళ్ళి నెమ్మదిగా నా స్థైర్యాన్ని ఊగిసలాడిస్తున్నట్లు తలుపులు ఎలా లాగుతోందో!

"ఏయ్—నిన్నే—ఇలారా"

ఆమె రెండు మూడు మాటలనుమాత్రం వదలి నాచే ఎన్నో ఆడిస్తోంది. సరే—ఏం చేస్తాను? ఈ అవస్తను అధిగమించడం అసాధ్యంగా వుంది. నా స్థానంలో ఇప్పుడు ఎంతటి నిగ్రహంగలవాడున్నా, ఎంత ధైర్యవంతుడైనా ప్రకృతి వాటిని వాడినుండి దూరంచేస్తుంది. తప్పదు. క్షణటిలో ఆమె వచ్చేసింది. బరిమీదికి నల్లత్రాచు పడగ యెత్తి వచ్చేటట్లే నాకెదురు నిలచింది. చీకట్లో కాటుక కళ్లు మిలమిలలాడాయి. ఆమె అచంచలగా నిలుచునివుంది. అబ్బ! ఎంతటి గాంభీర్యం! ఆమె కన్నులలోకి సూటిగా చూశాను. అరే—కళ్లల్లో నీళ్లు! ఎందుకూ? నే నింతసేపూ ఊహించింది నిజం కాదా? మళ్ళీ ఇంకో భావవీచిక—లేదోయ్—ఆమెకు నీ స్థితి జాలి గొలుపుతోంది. శలభం జ్యోతిని ముద్దుబెట్టుకోడానికి మీదపడుతూంటే జ్యోతికే గనుక కన్నీరుంటే ఇలాగ ఏనాడో కార్చివుండేది—"నిజంగా నే??"

## 3

"వెళ్లు. లైటు వెయ్"-ఆమెపై ఎంతో విజయం సాధించాననే గర్వంతో ఆజ్ఞాపించాను. త్రుటిలో ఆమె స్విచ్ ఆన్ చేసింది. గది అంతా కాంతిమయమైంది. ఆ వెలుగు మా ఇరువురి హృదయాలలోకి ప్రవేశించగలిగిందా? ఏమో! "ఇలా వచ్చి ఈ మంచం మీద కూర్చో"ఆమెను ఓదారుద్దామని, ఆమె దీనత్వం గూర్చి తెలుసుకుందామని, ఆమెపై జాలిబూని ఆమెను ఆదుకొందామని, ఆమెకు నీతి గరపుదామని, ఆతురపడ్డాను. మనిషిలో అహంభావం ఎప్పుడు ఏ రంగులో ఎంతటి కృత్రిమకాంతితో మెరుస్తుందో ఎవరూ గుర్తుపట్టలేరుసుమా! పైకి విజయభ్రాంతిగా అవుపించిన ఘోర పరాజయం సైతం మన కగుపించదు. ఆ దృష్టి భగవంతుడు ఏకొద్దిమందికో ఇచ్చాడు. వారే ఆదర్శాలకు అనుగుణంగా కఠోరవ్రతాన్ని చేబట్టి ప్రవక్తలయ్యారు.

నా ఆజ్ఞప్రకారం ఆమె తూచా తప్పకుండా నడచుకుంటోంది. వెంటనే వచ్చి పరుపుమీద నాకు ఎదురుగా అతి సమీపంగా కూర్చొంది. మా ఇరువురకు మధ్య అడుగు ఎడమైనా లేదు. ముఖాలు, కళ్లు ముఖాముఖీని కొన్ని అంగుళాల మేరకు వచ్చేశాయి. నాకు ఆ క్షణంలో కలిగిన ఆశాభంగం వర్ణనాతీతం. ఇందేదైనా ఇంద్రజాలం ఇమిడి వుందా? చీకట్లో ఆమె కళ్లు నాకు అలాగవుపించాయా? ఆమె నవ్వుతోంది. అది సాధారణపు నవ్వు గాదు. పకపక నవ్వేసినా బాగుండును. పువ్వులాగ పెదిమలు విప్పారి లీలగా మందహాసాన్ని మహాస్త్రంలాగ నా కళ్లల్లోకి ఆ కళ్లు ప్రయోగించాయి. క్షణంముందు ఈ నవ్వునే కన్నీళ్లుగా చూశానా? అబ్బే—లేదు. నన్ను నేనే నమ్మలేకపోతున్నానేమిటి? నా నిశ్చయం, నాపథకాలు పునాదులకంట కదిలిపోతున్నాయి. నన్ను వ్యథపాలుచేసి బాధపడుతున్నాను నేనని తెలియకేనేమో కొంతసేపు ఆ చిరునవ్వును పొడిగించింది. నన్ను జయించినందుకు గర్విస్తోంది అనుకున్నాను. లేదూ ఆనవ్వుతో నామీద కక్ష సాధిస్తోందా? ఈమె నెలాగైనా సరే జయించి తీరాలి. నాలో ఉక్రోశం పులుముకుంది. నాకుగా నేనే అనేక ఊహల సుడిగుండాలు నిర్మించుకొని వాటిలో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నా.

"నీ పేరు"

"రజని"

"మీ దీవూరేనా ?"

"ఒక వూరేమిటీ" హేళన ధ్వనించింది.

"వృత్తి" సూటిప్రశ్న నాది.

"వృత్తా—చూస్తున్నారుగా", నవ్వు సెలవుల దాటింది. బియ్యపుగింజలవంటి పలువరుస లీలగా వెలుగు చిలికింది.

"ఇది నీచం కాదూ?"గంభీరమైన నా సవాలు.

"నీచమా? ఎందుకో" ఎంతటి నిర్లక్ష్యం ఈ సమాధానంలో.

"అభిమాన మనేదే వుంటే" నా క్రోధ నిస్వనం.

"అభిమానమా—బోలెడు వుంది" విస్పాటమే దీనిలోనూ.

"ఉంటే" సందిగ్ధత వెలిబుచ్చాను.

"ఉన్నదని రొమ్ము విరుచుకునేవాళ్ళకంటె" సమాధానం తీవ్రరూపం దాలుస్తోంది.

"నీకు వివాహమైందా?" ఎందుకో ఈ ప్రశ్న.

"అయితే— ఇలాంటివాళ్లదగ్గర ఎందుకుంటానూ?" నన్ను దెప్పుతోంది అవినీతిపరుణ్ణని. నా నీతి, నిజాయితీలు ఈమెకు చూపించాలనుకున్నాను.

"అయితే దయచెయ్. ఇక్కడెందుకు?"

"అలాగే వెడతాను. మీ రేది చెబితే అదే చెయ్యాలి ఇప్పుడు ఇక్కడ. కాకున్నా రాజ్యమేలేది మీరు. న్యాయమైతే మటుకు మామాట ఎవరికావాలి. ఇదే మాపని. రమ్మంటే రావడం, పొమ్మంటే పోవడం" ఘాటెక్కుతోంది విమర్శ. "ఇప్పుడు పొమ్మంటే పోతున్నా—మళ్లీ రమ్మంటే రావలసిందేగా—ఈసారి ఏవీ మరచిపోకండి" ఆమె లేచి నాగుబాము వడిగా పాకినట్లు నడిచి గదిబయటకు వెళ్ళింది. నిజంగా త్రాచుకున్నంత రోషమూ, పగా ఆమెలో ఉన్నాయని,— నేను కామంవల్లగానీ ఎరుపెక్కాయేమో అని భ్రమించిన— నేత్రాలు పదేపదే నాలో ప్రతిధ్వనింపజేశాయి. నా సవాలుకు ఎదురు సవాలుచేసి ఆమె వెళ్ళిపోయింది. ఆమె స్థితినిగూర్చి తలుచుకొంటూంటే నాకు చిత్రంగా మూడు పోలికలు స్ఫురించాయి.

ఒకడు గజదొంగ. స్వతహాగా ఎలాంటివాడైనా క్రమేపీ రాటుదేరాడు. దొంగతనం వృత్తిగా,

చలాకీగా, సులువుగా చేసేస్తాడు. నదురూ, బెదురు వుండదు. సమాజం వాడికి పనివ్వక వాణ్ణీ, పెళ్లాం బిడ్డల్నీ మాడ్చేయ్యాలని పగబట్టింది. ఆకసి వాడిలో దాగివున్న దౌర్జన్యప్రవృత్తిని నిద్రించే ఫణిరాజు నెత్తిపై తన్నినట్లు ఉద్రిక్తపరచింది. వాడు ఆ ప్రవృత్తి ప్రకోపంవల్ల తన్ను ఆ హీనస్థితికి లాగి తనని ఆకలిమంటలలో మాడ్చి దహించదలచిన సంఘంపై కక్ష తీర్చుకోడానికి దీక్ష బూనాడు. దొంగగా మారాడు. వృత్తిగా చేపట్టాడు. అదెప్పుడైతే జీవనాధారంగా స్వీకరించాడో మనం జీవనం కోసం ఎలా బాధపడతామో అలాగే బాధపడతాడు. పట్టుబడితే తాపులు తింటాడు. జైలుకి వెళ్తాడు. మళ్ళీ బయటకొచ్చినా అదేపని. అందుకై అది చేయడంలో ఏమీ అనుమానం వుండదు. వాడి జీవితం సాంతం దొంగతనంతోనే గడపాలని ముద్ర వేసుకొన్నాడు. వాడికి మనం అనుకునే మానాభిమానాలు, నీతినియమాలు ప్రమాణాలు కావు. వాటికెదురీదడమే వాడి ఆశయం.

బ్లాకుమార్కెటు చేసే షావుకార్లు. ఎదుటివాణి ఆ నేరానికే సంకెళ్లు వేసి జైలుకు తీసుకెడుతూంటే ఆ తీసుకెళ్లేవాళ్లకే మస్కా వేస్తాడు. ఆరీత్యా ధనార్జనే వాడి వృత్తి. వాడూ మానాభిమానాలు తనకు చిత్రంగా నిర్వచించుకుంటాడు.

రాజకీయవేత్తో! వాడూ అంతే. ఒక అవినీతికి పెద్దపాము నోటబడ్డ వైకుంఠపాళీ పావులాగ మొదటి గడికి దిగి మరుక్షణంనుండి మళ్లీ నిచ్చెనలు, ఆశలు, ఎన్నికలు—మానుకుంటాడా? మళ్లీ గద్దెకొచ్చినా అదే ఆట. అది వాడి వృత్తి. మానాభిమానాలు వాడూ చిత్రంగానే చిత్రించుకుంటాడు. మునిసిపల్ చైర్మనులు, ప్రభుత్వోద్యోగులు, అధికారులు, వేశ్యలు—ఒకరేమిటి—అందరూ ఒకరికి తెలియకుండా ఇంకొకరు వేరు వేరు రంగాలలో రంగు రంగులలో దోపిడి చేస్తున్న గజదొంగలే. మొదట్లో అందరు మంచివాళ్లే. అయితే దౌర్బల్యంవల్ల సంఘం తనకుగా తాను వాళ్లను ఆ యా నీచాతినీచకృత్యాలకు పురికొల్పి తద్వారా తనకుతానే సృష్టించుకొన్న వాగురలో తగుల్కొని వ్యాధులతో కుళ్లుతో, అవినీతితో కుములుతూ వుంటుంది. ఈ ఇంద్రజాలాన్ని నటించడంలో రజని గూడా ఒక ప్రముఖ పాత్రధారి యని నిశ్చయమైంది.

## 4

పడుకుందామని ఎంత ప్రయత్నించినా నిద్ర రాదే. టైము దాదాపు రెండౌతున్నది. ఒళ్లు క్రమంగా నీరసంతో సోలిపోతోంది. లేచివెళ్లి లైటు ఆర్పడానికూడా ఓపిక సన్నగిల్లింది. అనుకోని అనేక సంఘర్షణలు నన్ను బలహీనపరుస్తున్నట్లయింది. ఎలాగో వెళ్లి కిటికీ తలుపులు తెరచాను. కొండగాలి మళ్లి వుంటుంది. శరదృతువైనా హేమంతపు వాసనలు తగిలాయి. చల్లగా మెల్లిగా తాకింది శీతల పవనం. 'దేవదాసు' రెండో ఆట అయిపోయిందనుకుంటాను. ఆఖరి ఘట్టంలోని పాట నెమ్మదిగా చెవులకు సోకుతోంది. "జగమే మాయ బ్రతుకే మాయ — వేదాలలో సారమింతేనయా" వినిపిస్తున్నాడు ఇంకా ఏదో దేవదాసు త్రాగుబోతు. ఎందుకు ఈ శుష్క వేదాంతం ప్రచారం చేస్తున్నారు వీళ్లు? లేకుంటే ప్రజల బలహీనతను అలుసుగా గ్రహించి దానిపై డబ్బు చేసుకుంటున్నారా? దేవదాసు ఆ స్థితిలో ఎలాగుండివుంటాడో ఊహించారా డైరెక్టరు గాని, నిర్మాతగాని? త్రాగుబోతునోటంట తత్వాలేమిటీ అని ఆలోచన గలగలేదూ? ప్రజల అమాయికతను పసికట్టి ఎన్ని విధాల వాళ్లను దోచుకోవాలో అన్ని విధాలా గుల్లచేస్తున్నారు. కొద్ది నిమిషాలక్రిందట ఉక్కపోసినట్లున్న నాకు ఆ చల్లనిగాలి తగలడంతో దేహం వణకడం మొదలైంది. మళ్లీ లేచి కిటికీ మూసి మంచంపై చదికిలబడ్డాను.

రజనినిగూర్చిన ఆలోచనలు నాకు కునుకు రానియ్యడం లేదు. ఆమె ఎవరైయుంటుంది? ఏ పరిస్థితులకు బానిసై ఇలా మారిపోయింది? సంఘాన్ని ఆమె ఎలా చూస్తోంది? ఆమెవంటి వాళ్లు బయటపడే మార్గం? అసలు వాళ్లను బయటకు తీసుకురావడమేమిటి? చెయ్యి అందిద్దామనివెడితే ఆమెతోబాటు ఆ రొంపిలో ఇరుక్కుపోతే? ఏమైనా సరే ఆమె బ్రతుకునుగూర్చి తర్కించాలి. ఇలాగనుకుంటూంటే రజని మళ్ళీ వచ్చింది.

ఇప్పుడు నాలో అవాంఛనీయ ఉద్వేగాలు ఏమీ లేవు. సరాసరి ఆమె నావద్దకు వచ్చింది. తన కుసుమకోమల హస్తంతో నన్ను తట్టి "ఇదిగో! నన్ను గూర్చి వ్యథచెంది మనసు పాడుచేసుకోకండి. లైటు ఆర్పుకోలేదు. తలుపు వేసుకోలేదు" అన్నది. ఆమె

స్పర్శ, పలుకుతీరు నాకు ఆమె సానుభూతి ప్రకటిస్తున్నదన్నాయి. మనుషు లెంత చిత్రంగా ఉంటారు! ఆమెయం దొకలాగున కరుణ వహిస్తున్నానని నే నను కుంటూంటే ఎందుకో నేనంటే ఆమె జాలిపడుతోంది. "అలాగే, లైటు ఆర్పేసి పడుకుంటా" అని లేచాను. కొక్కానికి దగిలించిన చొక్కా జేబులోంచి కలం తీసుకున్నాను.

"ఏమైనా వ్రాదా మనుకుంటున్నారా?" ప్రశ్నించింది.

"ఔను"

"ఏమిటీ?"

"ఏదో ఒక అనుభూతి"

"అడగడం మరచాను. మీరేం చేస్తుంటారు?"

"ఏమీ ఉద్యోగం లేదు. పత్రికలకు అప్పుడప్పుడు కథలు వ్రాస్తుంటాను."

"మీకు... పెళ్లయిందా?" నే నడిగిన ప్రశ్నలన్నీ వరుసగా వేస్తోంది.

"లేదు"

"లేదూ!" ఎంతో ఆశ్చర్యం ప్రకటించింది

"నీవు చదువుకున్నావా"

"ఏదో ఆరో తరగతిదాకా వెలగబెట్టాను"

"కథలు చదవగలవా?"

"పత్రికలు తరచు తిరగేస్తుంటాను"

"నీవు మళ్ళీ ఎందుకొచ్చావు?"

"నిజంగా అడుగుతున్నా—ఒకటి చెప్పండి. మీరు నన్ను గురించి మథనపడుతున్నారు."

"ఊఁ... ఊఁ... లేదు—లేదు."

"అబద్ధం ఎందుకూ? ఇన్నాళ్ళకు ఎదుట నిలిచి మాట్లాడగల ధీమా నాకు కలిగించే వ్యక్తి కనుపించారు ఒక చిన్న మనవి."

"ఏమిటదీ?"

"ఒక పరాయి ఆడుదాన్ని గూర్చి ఇంత బాధ చెందడం అనవసరం. అది ఒక వ్యాధియై మిమ్మ పీడిస్తుంది. ఈ జబ్బు చాలా గడ్డుది. దీన్నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. వ్యసనాలన్నిటికన్నా స్త్రీ వ్యసనం చెడ్డది. ఆడుదాన్ని బాగుచేయడం అనేది గూడా వ్యసనం వంటిదే. సంస్కారానికని, ఆమెను లేవనెత్తడానికని లేనిపోని బాధలు పైవేసుకొని కుమిలి కుమిలి తుదకు అదే యావతో శుష్కించి యౌవ్వనం పాడుచేసుకుంటారు." ఆమె సుదీర్ఘ వ్యాఖ్యానం కొనసాగించింది. తనకంటె ఎన్నోరెట్లు బలహీనుడై తనచే ఓడింపబడ్డ ప్రత్యర్థిని దయతో చూసి మాట్లాడే వస్తాదు వదనాలివి. ఆమె వెళ్ళిపోయింది. వెళుతూ స్విచ్ ఆఫ్ చేసి తలుపు దగ్గరగా బిగించి వేసింది—ఆ బిగింపు ఇంక తిరిగి ఆమె రాదని నాకు స్ఫురింపచేసింది.

మనస్సు ఒక నిశ్చయానికి వచ్చింది. దానితోబాటు అది కొంత శక్తిని ఉత్తేజాన్నీ ప్రసాదిస్తున్నది. నేను లేచి త్వరగా నడిచి తలుపు గడియపెట్టాను. లైటు వేశాను. మంచంమీద కూర్చొని కాగితాలు పుచ్చుకుని కలం తీసుకున్నా. స్థాయి కుదుర్చుకున్న చిత్తం. సంస్కారానికి దారితీసే నిర్ణయం. నిరాటంకంగా నిటారుగా చొచ్చుకొనిపోయే భావస్రవంతి. కలం చకచక సాగిపోయి కాగితంలో తెల్లదనాన్ని వెలితి చేస్తోంది కాలం నాకు తెలియకుండా ఎలా గడచిపోతోందో—

"ఆమె చరిత్ర చాలా చిత్రమైనది. అవనిలో అటువంటి ఆడవాళ్లు అతి అరుదుగా అవుపిస్తారు. ఈ ఇతివృత్తం వింటే మీరు విస్తుపోతారు. ఇట్లాంటి వ్యక్తులుంటారా అని మీ మనసు మిమ్మల్నే ప్రశ్నిస్తుంది. నిజం కల్పనకంటె చిత్రంగా వుంటుంది. కల్పనను మించిన కల్పన కవిని మించని రవి కల్పించాడా అనే భ్రాంతి జనిస్తుంది.

తల్లిదండ్రులకు కడబుట్టు ఆడబిడ్డ ఆమె. వాళ్లు చేసిన పాపమేమిటో—బిడ్డలు యుక్తవయస్కులై కొందరూ, కాకుండా కొందరు క్రమేణా కాలం చేశారు. అయినా ఏడు వచ్చేసరికి ఆ కుటుంబంలో మిగిలిన నలుసు ఒక్కతే అయింది ఆమె. వారిది బ్రతికి చెడ్డ సంసారం. తల్లి దండ్రుల్ని పట్టుకున్న పూర్వపు వాసనలు ఆ వూరు తమకు అచ్చిరాలేదన్నాయి. ఏది రుచిమాచినా చేదుగా వుంది. పూలనమ్మిన రాజవీధిలో కట్టెల కావడి మోయలేకపోయాడు ఆ మోతుబరి. గంపలో ఇరికించుకొనే కాడికి కుదించుకుపోయిన తమ పెద్దయింటి సంసారాన్ని నెత్తికెత్తుకొని ఆయనా, అయిదేళ్ల పసిపాపను చంకనిడుకొని ఆమెతల్లి కాలినడకను గడచారు ఎన్నో వూళ్లు.

చేరుకున్నారో పల్లెటూరూ పట్నవాసమూ కాని మధ్యరకపు గ్రామం. పుచ్చుకున్నాడు రెండెకరాల కౌండ్ర కౌలుకి. కాని కళ్లిన గంజిదాగి ప్రొద్దుబుచ్చడానికే సిద్ధమయ్యాడు. అయినా పొయ్యికిందికీ మీదకీకూడా ఆ ముగ్గురూ సరిపెత్తలేక పస్తుపడుకున్న రోజులూ ఉన్నాయి. ఒక యేడాది దాటగానే వీధిబడిలో వేసింది ఆతల్లి పిల్లను. కూతురుకు రెండు ముక్కలు చెప్పించాలని ఆ యిల్లాలి తపన. ఆరేళ్లే అయినా వరహాలు అని పేరుపెట్టుకున్న ఆపిల్ల బొంగరంలాగ వీధంతా తానే తిరిగేది. లేమి, తమ పిల్లలకంటె దాని అందం, చురుకు, తెలివితేటలు మూడ్డంవల్ల పొరుగింటివాళ్లకు వరహాలనే పేరు ఈసునే ఇనుమడించింది. వాళ్ళనే సూటీపోటీ మాటలన్నీ వింటూ పల్లెత్తుమాట నకుండా పిల్లను చల్లగా వత్సాన్ని పొదుగులో ఇముడ్చుకుని తోక నాకుతూ పాలు కుడిపే గోమాతలాగ అక్కున చేర్చుకునేది తల్లి.

రెండేళ్లు గడచాయి. కౌలుకు పుచ్చుకొన్న పొలం వాళ్లమీద కసిబూనినట్లు సరిగ్గా పండడం చాలించుకుంది. పెట్టుబడుల తాలూకు వడ్డీలు గుణించుకుంటున్న నోట్లు పేదవాని దీనావస్థకు పెదవి విరుస్తున్నాయి. ఇంక బాకీ తీర్చే దారిలేదు. "ఈపాటికి దయచెయ్ నాయనా!" అన్నాడు ఖామందు. ఆఖరికి జీవనోపాధి కూడా కరువయ్యింది. నీళ్లబిందెలూ, గడ్డికావడీ ఎత్తి ఒక ఏడాది సాగనంపాడు. గతాన్ని తలుచుకుంటూ గుండెల గుబులుతో కాళరాత్రులు గడపలేక వయసుతోబాటు ఆ తల్లిదండ్రుల దేహాలు తడపలైపోతున్నాయి. అయిదో తరగతిలో అందరికంటె అతిదక్కగా చదువుతున్న బిడ్డను పనిలో పెట్టవలసివచ్చింది. ఆ వూరి కాఫీ హోటల్లో దాసిగా కుదిర్చారు. పిండిరుబ్బడం, నీళ్లు మొయ్యడం, అరిదేశీ పరదేశీ త్రాగి ఖాళీచేసిన గ్లాసులూ, కప్పులు కడగడం, ఇల్లు తుడవడం ఈ మొత్తంపనులకు నెలకు ఆ అయ్యరు అయిదురూపాయలిస్తానన్నాడు. వాడికీ పట్టుమని పద్ధెనిమిదేళ్లు లేవు. ఆరువందల మైళ్లు తిరువనంతపురంనుంచి వచ్చి, ఆ వూరు వతను గనిపెట్టి వండుకు తింటూ, ఒక్కడూ స్వయంశక్తివల్ల దమ్మిడీలు రూపాయలుగా మార్చడానికి తాపత్రయపడుతున్నాడు.

పదో యేట వరహాలు కాఫీహోటలు పనుల్లో కమిలిపోతూంటే గుడ్లనీళ్లు గుక్కుకొనేవారు తల్లిదండ్రులు. వాళ్లుమాత్రం ఏం చేస్తారు? తిండిలేక మాడి చస్తూంటే ఊరూ వాడా నిర్దాక్షిణ్యంగా చూసింది గాని వాళ్ళకిన్ని గంజినీళ్లైనా పొయ్యలేదు. అయ్యరు ఏ నెలకానెల ఖచ్చితంగా అయిదు రూపాయలూ ఇచ్చేవాడు. తల్లి పిల్లతో పాటు తరుచువుంటూ చిన్నపనీ చితకపని మప్పింది. సహజంగా తెలివరి, గడుసరి ఒళ్ళు దాచుకోడమెరుగని అమాయిక, వరహాలు అనతికాలంలో ఆ పనిలోనూ ఆరిందా అయింది. తండ్రి దొరికినప్పుడెల్లా కూలికి పోయేవాడు. పొరుగిళ్లవాళ్లకి తల్లి పిడకలుచేసి, వడ్లుదంచి, బాగుచేసి, ఇళ్ళు అలికి పల్లవేసి సాయంత్రానికెలాగో అర్ధరూపాయకు తక్కువగాకుండా సంపాదించేది. దయయుంటే ఉన్నమ్మలు నిన్న తినగా మిగిలిన పచ్చడి లేక పులుసు—నీళ్లలో నానవేసిన మెతుకులు గంజీ పోస్తే అదే ఘనంగా కళ్ళకద్దుకుని పుచ్చుకునేది. అయ్యరు ఒక ఆశ చూపాడు వాళ్ళకి. సంక్రాంతిపండుగకు వరహాలుకు ఒక గౌనూ, పరికిణీ కుట్టిస్తానన్నాడు. ఔను. పది రూపాయలిచ్చినా మళ్లీపని అయిదు రూపాయలకే అమరుతోంది. ఆమాత్రం పెట్టలేడూ! ఆ తల్లికి ఆ మాటె వెయ్యి వెయ్యిరూపాయల విలువ చూపింది. పిల్ల వరహాలుకు ఈమాటలు వింటూంటే ఎంతో ఆనందం కలిగింది. తనకు ఊహ వస్తోంది. క్రొత్త పరికిణీ, గౌనూ ఎలాగుంటాయో! ఇప్పటిదాకా క్రొత్త అనే మాట ఆమె వాచకాల్లోనే చదివింది. అదెలాగుంటుందో చూడాలి తనకు. ఓహో! ఆడమనసు మొలకెత్తేటపుడు ఆశ లెలాగుంటాయో! మగాడిమాటెలాగున్నా ఆడదానికి కూడున్నా సరే లేకున్నా సరే వంటికి నిండా శుభ్రంగా బట్టవుంటే కడుపు ఏడవదు. నిజంగా బట్టలేని కారణంగా ఎందరు సుందరుల అందం వాళ్లను కట్టెలుగా నిలబెడుతోంది! ఆ యెర పిల్లకు బాగా పనిచేసింది. క్రొత్త బట్టలకోసం చేతులు పుళ్లుచేసుకుంది రుబ్బురోలు దగ్గర కూర్చొని. పిండి విసిరి విసిరి ఆ పాప అరచేతులు కనుముగట్టాయి. గిన్నెలు తోమితోమి గీసుకుపోయాయి అతి సున్నితమైన వేలికొనల అంతర్భాగాలు. "ఇంకా సంకురాత్రి ఎన్నాళ్లకే" అని అడిగేది తల్లిని. "ఏమే—ఎందుకూ" అంటే "అమ్మా! అయ్యరుగారు నాకు క్రొత్త పరికిణీ, గౌను కుట్టిస్తానన్నారుగాదే" అనేది నవ్వుతూ. కూతురు మాటలు వింటూ పైకి నవ్వుకొని లోపల్లోపల కుమిలిపోయేవారు తల్లిదండ్రులు.

మనం ఎలాగున్నా కాలంమాత్రం ఆగదు. దొర్లిపోకుండడమే దాని విధి. "అయ్యరుగారూ! ఈ సంకురాత్రికి వరహాలుకు ఓ చిన్నచీరె, ఆరు గజాలది చాలెండి; మువ్వాతిక ముక్కైతే రవికె—కొని పెడుదురూ" ప్రాధేయపడింది తల్లి. "చూద్దాంలే—ఇంకా ఈడేరలేదు గదా" అన్నాడు పెడదోవను ఆలోచించే అయ్యరు. "ఆడది గాదుటండీ—తమ చలవ" అని ఆమె శెలవు పుచ్చుకుంది.

మరునాడు ప్రొద్దున్న వరహాల్ని పరకాయించి చూశాడు అయ్యరు. నిన్నటిరోజున దాని తల్లి అలా గనక పోతే తానలాగ చూసేవాడు గాదు. తనలాగే ఎందరో ఆకన్నెపడుచువైపు మిర్రుగా చూస్తున్నట్లు తోచింది. నిజమే—వరహాలులో నిక్షిప్తమై వున్న కాంతి, ఇప్పటివరకు ఎక్కడో మరుగుపడివున్న మెరుపు, విపరీతమైన శక్తితో ఆమె ప్రతి అవయవాన్ని పెగల్చుకు వెలికి రావడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. పసితనం బాధపడుతోంది ఆ నూతనశక్తి విపరీతంగా విజృంభిస్తూ తన్ను అణచి పారద్రోలుతూంటే భరించలేక. ఇపుడు వరహాలు నిజంగా తళ తళ మెరుస్తున్నట్లు దిగ్భ్రాంతి నొందుతున్నారు చూసేవాళ్లు. నీళ్లు పోసుకోకపోయినా సరే ఆమె నిగ నిగలాడుతోంది. చినిగిన బట్టలలో వుంటూనే ఆమె చింతపువ్వులాగ అనుతోంది. చింపిరి తలతోనే కెంపులా గవుపిస్తోంది. నీరసంగా వుంటూనే సారసంగా వెలుగుతోంది. ఏ సంరక్షణా లేకుండానే ఇలాగున్నదే—అన్ని హంగులూ వుంటే అపర రతీదేవిలాగ వుండదూ? అనుకున్నాడు అయ్యరు.

మరుసటి నెలనుండి వరహాలుకు జీతం ఎక్కువైంది. వడలు వెయ్యడం, ఇడ్డెనలు చెయ్యడం, వంటింటి లోపలి పనులుకూడా దాని చేతనే చేయిస్తున్నాడురా అయ్యరు అని అసూయపడ్డారు కుర్రకారు. తల్లితో చెప్పి పిల్లచేత ఆ నౌకరీ మానిపించుదామని ఒకరిద్దరు అమ్మలక్కలు ప్రయత్నించారు. కాని జీవనోపాధికి స్థిరమేదీ? తండ్రికి రోజూ టీ అలవాటయ్యింది. తనకీ ఏదో తిండి వెళ్లిపోతుంది. అయ్యరు సద్భావంతో కంటికి రెప్పలాగ తమ్ము ఆదుకొంటున్నాడు. ఈడేరింది గదా అని ఇప్పుడా పనిలోంచి తప్పిస్తే సిద్ధాన్నం కాలదన్నుకొన్నవాళ్లమౌతాం అనుకొన్నారు వృద్ధ దంపతులు. "ఏదో ఎవణ్ణో ఒకణ్ణి వెదికి ముడెట్టేదాకా ఇలాగే కాలం గడిపేద్దాం" అన్నాడు తండ్రి. ఆ వూహ తట్టగానే తల్లి గుండె గతుక్కుమంది. అవును ఆడది. త్వరగా ఒక గుదిబండకు కట్టబెట్టాలి. లేకపోతే ఏక్షణాన ఎవళ్లకి ఎలాంటి బుద్ధులు పుడతాయో?

వరహాలు ఏపుగా పెరుగుతున్న లేదీవ. పుష్ప సౌరభాన్ని తనలో ఇముడ్చుకొని వికసించడానికి ఉవ్విళ్లూరుతున్న మొగ్గ. ఇలా ఆలోచించినకొద్దీ ఆ తల్లి ప్రాణానికి తహతహ అధికమయ్యింది. లోకమూ, సంఘమూ ఈర్ష్యాసూయలు పులుముకున్న సుద్దబొమ్మలు. పులుకు పులుకుమంటూ చూచి ఓర్వలేక పుష్పించే కుసుమాన్ని పుణికివెయ్యడమే వాటి వాంఛ. తమ కెదురీదే శక్తిని సర్వవిధాలా కాలరాచి నలిపివెయ్యడమే వాటి కామం.

వరహాలు హోటలు పని పూర్తి చేసుకుని ఇంటికొచ్చేసరికి ప్రొద్దుబోయింది. "అమ్మా—అమ్మా—ఇవ్వాళ అయ్యరుగారికి నేనే అన్నం వండి పెట్టానే. కొంచెం వంట్లో నలతగావుండి పొయ్యి రాజెయ్య లేదట. నేనూ అక్కడే అన్నం తినేసి వచ్చా" అంది వరహాలు. పిల్లఅమాయకత్వానికి నొచ్చుకుంది తల్లి—గుడిసెవెలుసుల్లోంచి చల్లగాలి గ్రుచ్చుకొంటోంది. తండ్రి గోనెసంచి కప్పుకొని పెడగా పడుకున్నాడు. కొంచెం వారగా చింకి ఈతాకుల చాపమీద, అయ్యరు వారంరోజుల క్రితం వాళ్లకిచ్చిన చిరుగుల పాతగొంగళి కప్పుకుని తల్లి పడుకుంది.

త్రుటిలో లేడిపిల్లలాగ గెంతి వరహాలు తల్లి వొడిలో ముడుచుకుపోయింది. వృద్ధాప్యంలోవున్న తల్లి బొమికెలు ఆ పడుచును పొడిచినట్లైంది. వరహాలు కిప్పుడు కొంత స్థలం అదనంగా కావలసి వస్తోంది వొళ్లు దాచుకోడానికి అని గ్రహించింది తల్లి. ప్రతి అవయవాన్ని తన వొంటికి హత్తుకొని బిడ్డను పెనవేసుకొంది ప్రేమతో. "అమ్మా—వచ్చే నెల నుంచీ నాకు ఇరవై చేస్తారుట" సంతోషం పట్టలేక పోతోంది వరహాలు. దుఃఖం ఆపుకోలేకపోతోంది తల్లి. ఎంత ఆపుకొందామనుకున్నా ఆమె కన్నీరు ఆగలేదు. "ఇస్తాడమ్మా—ఇవ్వరూ—మొగాడవైతే లేవంటే గరిసెకు తక్కువ ఇవ్వరు జీతం కమతానికి కుదిరితే" అన్న అమ్మమాటలు విని మరీఆనందంపొందింది వరహాలు. కాని క్షణంలో మళ్ళీ, "వరహాలూ—అమాయకురాలవు. జాగ్రత్తగా మసులుకో రేపటి నుంచీ" అని బరువుగా వెలువడ్డ మాటలకు ఆ పసి హృదయం స్తంభించిపోయింది. "అమ్మా! ఏడుస్తున్నావా? ఎందుకే" నిటూరుగా ప్రశ్నించింది తల్లిని. "అబ్బే! లేదమ్మా—కుర్రాళ్లు గుర్తుకొచ్చారు. బ్రతికుంటే 'వేసి వెయ్'మని నేనూ తగునమ్మా అని నలుగురిలోనూ రాజ్యమేలక పోయేదాన్నా? నన్నే మాడమ నేలాంటి మొగుణ్ణి నీకు తేలేకపోయేదాన్నా" అనుకుంటున్నానని అసలు ఆరాటం తప్పించింది. "ఊరుకోవే అమ్మా—పోయిన కొడుకులు పోనే పోయారు. ఉన్న నేనే నీకు కొడుకును—కంట తడి బెట్టకు" అని లేత కొనగోళ్లతో ఆమె కన్నీరు వొత్తింది.

—సశేషం